ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రేషన్ వాహనాల నిలిపివేత!

- నాలుగేళ్ల తరువాత మళ్లీ డీలర్ల వద్ద పంపిణీ
- వికలాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకు సరఫరా
- ప్రభుత్వం నిర్ణయంతో వాహనదారులు డీలా

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వచ్చేనెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరఫరాలో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గం మంగళవారం నిర్ణయం తీసుకుంది. 2021లో అప్పటి వైసిపి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ బియ్యం అందిస్తామని ఒక్కో వాహనానికి రూ.21 వేలు పారితోషికంగా కేటాయించింది. డీలర్లకు కిలో బియ్యంకు రూపాయి కమిషన్ ఇచ్చారు. ఒకవైపు రేషన్ పంపిణీపై డీలర్లకు కమిషన్ ఇస్తూనే మరోవైపు వాహనదారులకు రూ.21 వేలు కేటాయింపుపై వైసిపి ప్రభుత్వంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఒకే పథకానికి నాలుగేళ్లుగా రెండు చెల్లింపులు జరుగుతున్నాయి. దీంతో ప్రజా ధనం దుర్వినియోగమైందనే విమర్శలు వచ్చాయి. వాహనాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించి నిరుద్యోగ యువతకు వాహనాలు మంజూరు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 2802 చౌకడిపోలు ఉండగా సగటున మూడు డిపోలకు కలిపి ఒక వాహనాన్ని కేటాయించింది. జిల్లాలో 901 వాహనాలను కేటాయించారు. వాహనదారులు ఇంటి వద్దకు రేషన్ సరఫరా చేస్తారని అప్పటి ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో పంపిణీ అందుకు భిన్నంగా జరుగుతోంది. ఒక ప్రాంతంలోకి వచ్చినప్పుడు జంక్షన్ పాయింట్‌లో వాహనాన్ని ఆపి నెలకు ఒక్క రోజు కేవలం కొద్ది సేపు మాత్రమే రేష్న్ ఇవ్వడం పరిపాటిగా మారింది. దీంతో రేషన్ కార్డు దారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీలర్ల వద్ద అయితే నెలకు 15 రోజులు పంపిణీ జరిగేది. 15 రోజుల్లో కార్డుదారులకు ఎప్పుడు కుదిరితే అప్పుడు వెళ్లేందుకు అవకాశం ఉండేది.

టిడిపి ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం అక్రమ మార్గాల్లోకి వెళ్తున్నాయని, డీలర్ల నుంచి రేషన్ దారిమళ్లుతుందని ఆరోపణలు రావడంతో 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనే ఇంటి వద్దకు రేషన్ అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రేషన్ వాహనదారుల ద్వారా సరుకుల పంపిణీకి 2021 జనవరి 21న శ్రీకారం చుట్టారు. కానీ ఆచరణలో ఈ విధానం కూడా పూర్తిగా విఫలం అయిందని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధానంగా వాహనదారులు ప్రజలకు బియ్యం, ఇతర వస్తువులు ఇవ్వకుండా కిలోకు రూ.8 నుంచి రూ.12 వరకు పరిస్థితులు బట్టి డబ్బు ఇచ్చి పంపుతున్నారు. ఒక దశలో కార్డు దారులు రేషన్ బియ్యం కావాలని అడిగినా బియ్యం లేవు...సొమ్ములు తీసుకోండని హుకుం జారీ చేసిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో డీలర్ల వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించిన రేషన్ మాఫియా నాలుగేళ్ల నుంచి వాహనదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయడంలో కీలక భూమిక పోషించింది. దీంతో వైసిపి ప్రభుత్వం లక్ష్యం కూడా నీరు గారిపోయింది. 2021 నుంచి 2024 వరకు వాహనదారులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని తెలిసినా పట్టించుకోలేదు. జిల్లాలో 901 వాహనాలు ఉండగా అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో గత నాలుగేళ్లలో దాదాపు 100 వాహనాలపై కేసులు కూడా నమోదయ్యాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రేషన్ మాఫియా మరింత రెచ్చిపోయింది. గత ఏడాది కాలంలో వాహనదారులు, రేషన్ మాఫియా పూర్తి స్థాయిలో కుమ్మక్కై కార్డు దారులకు బియ్యం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నా పౌరసరఫరాల శాఖ, విజిలెన్సు విభాగం ప్రేక్షకపాత్ర పోషించింది. చివరికి నిఘా వర్గాల నివేదికలు ప్రకారం సిఎం చంద్రబాబు నాయుడు ఎండియు వాహనాల నిలిపివేతపై కీలక నిర్ణయం తీసుకున్నారు. రేషన్ వాహనదారులకు వాహనం ఇప్పటి రూ.21వేలు పారితోషికం ఇస్తున్నా అత్యాశకు పోయి

▶ 2లో

గుంటూరు నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ ఉద్యమం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కార్మిక సంఘాల నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

కార్మికుల హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకూ ఉద్యమం తప్పదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాల అమలు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా మే 20న నిర్వహించాల్సిన సమ్మెను యుద్ధ వాతావరణ పరిస్థితుల రీత్యా జులై 9న నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, పని ప్రదేశాల్లో నిరసనల్లో భాగంగా గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మార్కెట్ యార్డు వద్ద కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరులో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఇవి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తాయని, కార్పొరేట్లకు ఊడిగం చేసేందుకు సిద్ధం చేశారని విమర్శించారు. కార్మికులకు కనీసం యూనియన్ పెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా చేస్తాయన్నారు. కావున లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే సమ్మెకు దేశవ్యాప్తంగా సంఘీభావం తెలుపుతున్నారన్నారు. విశాఖ

▶ 2లో

నరసరావుపేట పట్టణంలో ర్యాలీలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

వ్యవసాయ రంగంలో సమస్యలపై ఆందోళన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం నిరసనలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

రైతు, కౌలురైతు వ్యవసాయ కార్మిక, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలు భాగంగా ఫిరంగిపురం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరుతూ రైతులు ఏడాదిపాటు ఢిల్లీలో చేపట్టిన ఆందోళన సందర్భంగా హామీనిచ్చిన కేంద్రం అనంతరం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మిర్చి, పొగాకు, పత్తి, శనగ తదితర పంటలకు మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డు ఇస్తామని దానికి అనుగుణంగా చట్టంలో సవరణ చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి ఇంతవరకు చేయలేదని తెలిపారు. ఉపాధి కార్మికులకు నెలలు తరబడి చేసిన పనికి వేతనాలు రావడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.రెండు లక్షల కోట్లు నిధులు కేటాయించి, కుటుంబానికి 200 రోజులు పని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో మౌలిక వసతులు కల్పించాలని, టెంట్, మెడికల్ కిట్టు, పేస్లిప్‌లు, సమ్మర్ అలవెన్స్,

▶ 2లో

వృద్ధుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలోని ఒకటో వార్డు నెహ్రూ నగర్‌లో నివాసముండే 69 ఏళ్ల మారుబోయిన పుల్లయ్య మంగళవారం తన ఇంటి వద్ద ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. ఇది విషయాన్ని గమనించిన తోటి చిన్నారులు తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పట్టణ పోలీసులు వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

సచివాలయ అడ్మిన్ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : విధుల్లో నిర్లక్ష్యంపై గుంటూరు 91వ వార్డ్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శిని విధుల నుండి సస్పెండ్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాదారణ ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల నాయకుల చిత్ర పటాలను తొలగించాలని నిబంధనలు అమలు చేయకపోవడంపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న వర్షాలు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరునుంచి భారీ వర్షం కురిసింది. వేకువజామున నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షాలతో గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. డొంకరోడ్డులోని మూడు వంతెనల వద్ద నీరు నిలిచింది. చేబ్రోలులో అత్యధికంగా 70 మిల్లీ మీటర్లు, దుగ్గిరాలలో 61.4, తెనలిలో 32.4, కొల్లిపరలో 28.8, మంగళగిరిలో 28, గుంటూరు తూర్పు 26.2, పెదకాకాని 26.2, గుంటూరు పశ్చిమ 24.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది.

వ్యవసాయ రంగంలో సమస్యలపై ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

థర్టీ పర్సెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిరంగిపురం మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాలలో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫిరంగిపురం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్కే.మస్తాన్‌వలి రైతుసంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహశీల్దార్ సునీతకు వినతిపత్రం ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు మాట్లాడారు. పంట కాల్వల మరమ్మతులు పూర్తి చేసి హై లెవెల్ ఛానల్ ద్వారా ఈ ఖరీఫ్ సీజన్లో వరికి నీరందించాలని కోరారు. కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలురైతు సంఘం అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగించడానికి ఆపాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కును కాపాడుకోవాలన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఆయా డిమాండ్లపై జులై 9న జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నరసరావుపేటలో నిర్వహించిన ర్యాక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ లేబర్ కోడ్ లు వలన 8 గంటల పని విధానం లేకుండా పోతుందని ఆయన ఆవేదన చెందారు. రానున్న రోజులలో 10 గంటల నుండి 12 గంటల పని చేయాల్సి వస్తుందన్నారు. కార్మికులు మరింతగా శ్రమ దోపిడీకి గురవుతారని చెప్పారు. కార్మిక హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులను లాభం చేకూర్చడానికే లేబరు కోడ్లను కుట్ర పూరితంగా అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. గుంటూరులోఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, సిఐటియు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పశ్చిమ కమిటీ అధ్యక్షులు బి.సత్యనారాయణ, మెడికల్ రిప్రజెంటేటీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.ఫణి, అబ్దుల్ సలీం, సిఐటియు శ్రామిక మహిళ కన్వీనర్ జి.రమణ, ఏఐటియుసి జిల్లా నాయకులు కోట మాల్యాద్రి, జగన్నాధరావు పాల్గొన్నారు. నరసరావుపేటలో సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్, డి.శివకుమారి, జి.మల్లీశ్వరి, అల్లాబక్షు, వీరకుమార్, ఎఐటియుసి నాయకులు కె.రాంబాబు, రంగయ్య, సత్యనారాయణ రాజు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పాత గుంటూరు సిఐగా వెంకట ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాత గుంటూరు పోలీస్ స్టేషన్ నూతన సి.ఐ.గా కె. వెంకట ప్రసాద్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా సైబర్ క్రైం విభాగంలోపనిచేస్తూ బదిలీపై పాత గుంటూరుకు వచ్చారు. ఇప్పటి వరకు పాత గుంటూరు సిఐగా పనిచేస్తున్న వీరయ్యను విఆర్‌కు పంపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కరోజు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. సిఐటియు నరసరావుపేట మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ మార్చి 30తో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను నడుపుతున్న ప్రైవేట్ సంస్థతో టెండరు గడువు ముగియడంతో ప్రభుత్వం మరో 2 నెలలు పాటు పొడిగించారన్నారు. గతంలో అవసరమైన మేర వాహనాల్లో డీజిల్ పోయించుకునే వెసులుబాటు ఉండగా కొద్ది నెలలుగా పరిమితం చేసినట్టు చెబుతున్నారు. దీంతో నెలలో డీజిల్ ఉన్న మేర వాహనాలను నడిపి అయిపోయినప్పుడు మూలకు చేరుస్తున్నారన్నారు. వాహనాలు సకాలంలో మరమత్మ్తుల చేయకపోవడంతో సేవలు సరిగా అందక తల్లీబిడ్డలను ఇళ్లకు తీసుకువెళ్లేందుకు వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కొన్నిసార్లు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వారు అడిగిన మొత్తం చెల్లించాల్సి వస్తోందన్నారు. తమకు ప్రస్తుతం ఇస్తున్న రూ 8,850 వేతనం సకాలంలో ఇవ్వకపోగా నెలల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయన్నారు. ప్రభుత్వానికి యూనియన్ పలుమార్లు వినతులు అందజేయడంతో ఇటీవల ఫిబ్రవరి వరకు బకాయిలు విడుదల చేసిందన్నారు. కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, వాహనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని, ఆదివారం, వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు అమలు చేయాలని, యజమాని వాటా పిఎఫ్ యాజమాన్యమే చెల్లించాలని, ఇఎస్ఐ అమలు చేయాలని, 8 గంటలు పని విధానం, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి మురళికి వినతి పత్రం అందజేశారు. డ్రైవర్లు సాంబశివరావు, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, అజయ్, కోటి పాల్గొన్నారు.

ఒక్కరోజు సమ్మె - డిఆర్‌ఒకు వినతి

బహుజన వాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపించిన కోరండి అంథోని

70వ పుట్టినరోజు వేడుకల్లో ప్రముఖుల అభినందన, సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

బహుజన వాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపించిన యోధుడు కొరబండి ఆంథోని అని ఆయన 70వ జన్మదిన వేడుకల్లో పలువురు అభినందించారు. ఒక పక్క ఆర్టీసీ అధికారిగా పనిచేస్తూనే మరొక పక్క తన కవితలతో సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతులను చేస్తూ చేశారని అన్నారు. అంథోని జన్మదిన వేడుకలు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. విశ్రాంత డీఎస్పీ గంటెల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ మాట్లాడుతూ దళిత ఉద్యమ నాయకులు కత్తి పద్మారావు ప్రధాన అనుచరుడుగా ఉంటూ దళిత మహాసభ ఉపాధ్యక్షులుగా ఎన్నో సామాజిక ఉద్యమాలను తనదైన శైలిలో పోరాటం చేశారని చెప్పారు. అరండల్‌పేట సిఐ కొరబండి ఆరోగ్య రాజు, న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీమ్, పెండెం బాబురావు, రాజవరపు శివనాగేశ్వరావు, మాదంశెట్టి వేలాద్రి, విశ్రాంత ఉపాధ్యాయులు కేబిఆర్జ్ ప్రసాద్, లక్ష్మీనారాయణ, డైట్ ఉపాధ్యాయులు మాతంగి సాంబశివరావు హాజరై అంథోని, ఆయన సతీమణి విజయలక్ష్మి దంపతులను సన్మానించారు. జిల్లెల పాల్ రాజ్, షేక్ మస్తాన్‌వలి, హైదర్, చాన్‌బాషా, ఎంపీ ప్రసాద్ రాజు, గొట్టిముక్కల కిషోర్, జడ ప్రసాద్, జెట్టి శేఖర్, కొరబండి రాంబాబు, స్వాతి, నలబోలు రాజా పాల్గొన్నారు.

మినీ మహానాడులో అసంతృప్తి - సర్దిచెప్పిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - తెనాలి

పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఈ ప్రాంత నాయకులు కార్యకర్తలతోనే ఎప్పటికీ తన ప్రయాణం ఉంటుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళ్యాణ మండపంలో ఆలపాటి అధ్యక్షతన మంగళవారం రాత్రి మహానాడు నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ చొరవను ప్రశంసించారు. అయితే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పాలనాపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి 43 సంవత్సరాల కాలం ఎంతో క్రమశిక్షణను నేర్పిందన్నారు. అదే క్రమశిక్షణతో నాయకులు కార్యకర్తలు మెలగాలని, చిన్నచిన్న సమస్యలను భూతద్దంలో చూడాల్సిన పనిలేదని, కాలక్రమంలో అంతా మంచే జరుగుతుందని చెప్పారు. ఎవరు అసహనానికి గురి కావొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.హరి ప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, విస్సార్ అండ్ ఎన్టీఆర్ కళాశాల కరస్పాండెంట్ ఎన్ సుధాకర్, కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు, వంగా సాంబి రెడ్డి, జె మహేష్, కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనిత, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తెనపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే కన్నా కృషి : శ్రీధర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి నియోజకవర్గ మహానాడును సత్తెనపల్లి పట్టణంలోని రఘురాం నగర్ ప్రజావేదికలో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ హాజరయ్యారు. శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ముందుగా తీవ్రవాదుల దాడిలో మరణించిన వీర సైనికులకు, ఇటీవల మరణించిన టిడిపి నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు వై.రామస్వామి, ఎన్.శవరయ్య, డి.నాగేశ్వరరావు సయ్యద్ పెదకరిముల్ల, మార్కెట్ యార్డు చైర్మన్ కె.శోభారాణి పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ద్వారా విత్తన కిట్లు

ప్రజాశక్తి-పల్నాడు : నవధాన్యాలు సాగు చేయటం వల్ల భూమి సారవంతం చెంది సేంద్రీయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. నరసరావుపేటలోని ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాల సాగు నేలతల్లి బాగు అనే పేరుతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. బహుళ పంటల సాగుకు అండగా నిలవడం, భూసారాన్ని పెంచడం ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడం ప్రకతి వ్యవసాయ ధ్యేయమన్నారు. నవధాన్యాల (పిఎండిఎస్) సాగు కోసం (ఏపీ సీ ఎన్ ఎఫ్) సిబ్బంది గ్రామాల్లో విస్తత ర్యాలీలు ప్రచారాలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఆరు డివిజన్లోని 118 గ్రామాల్లో 31,979 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలా రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు 40 రోజులు ముందు పంట సాగు కోసం 30 నుంచి 33 రకాల పప్పుధాన్యాలు, నూనె జాతులు, చిరు, తణధాన్యాలు, విభిన్న జాతుల ఆకుకూరలు విత్తనాలతో కూడిన 12 కిలోల బరువు గల కిట్లను రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరకే రైతులకు అందిస్తామని చెప్పారు.

నేలకు నవధాన్యాల సాగు అనే పేరుతో ఈ పథకాన్ని అమలు పరుస్తున్నారు. ఫ్రీ మాన్ సూయింగ్ డ్రై సోయింగ్ పథకం కింద పప్పు ధాన్యాలు, నూనె, తీగజాతి, చిరుధాన్యాలు, తణధాన్యాలైన పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, రాగులు, కందులు, జొన్నలు వంటి 31 రకాల వివద జాతుల విత్తనాలు ఈ కిట్టులో ఉంటాయన్నారు. విత్తన కిట్లు డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో తయారు చేయించి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 29628 కిట్లు తయారీ, 18894 రైతులకు పంపిణీ, 83260 ఎకరాలలో భూమిలో పీఎండీఎస్ విత్తనాలు సాగు చేస్తున్నారన్నారు. అడిషనల్ డిపిఎం ప్రేమ్ రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం పరిధిలో ఖరీఫ్ లో రైతులకు కావాల్సిన ఘన జీవామతం, కషాయాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు.

రేషన్ వాహనాల నిలిపివేత!

(మొదటి పేజీ తరువాయి)

అక్రమాలకు పాల్పడుతున్నారు. అంతేగాక నెల మొత్తంలో ఒక్కసారి మాత్రమే ఇళ్ల వద్దకు వచ్చి పోతున్నారు. 2021 నుంచి 2023 వరకు సెల్‌ఫోన్లకు మెసెజ్‌లు ఇచ్చే వారు. క్రమంగా రేషన్ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. నెల మొత్తం మీద ఒకసారి రావడం వల్ల చాలామంది రేషన్ తీసుకోలేకపోతున్నారు. దీంతో పోర్టబులిటిని ఎక్కువగా వినియోగించుకోవాల్సి వస్తుంది. దీనివల్ల కూడా మరిన్ని అక్రమాలు జరుగుతున్నాయి. దీంతో ప్రతినెల రూ.21 వేలు ఖర్చు చేసినా ప్రజలందరికి రేషన్ అందకపోవడంతో ప్రభుత్వం పాత పద్ధతిలోనే రేషన్‌సరఫరా చేయాలని, వృద్దులు, వికలాంగులు మాత్రం వాహనాల్లో రేషన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

రాజధానిలో స్థానికులకు పనులు కల్పించడం లేదు

నిడమర్రులో సుందరయ్య వర్ధంతి సభలో వక్తలు

సభలో మాట్లాడుతున్న ఎం రవి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని లోని నిడమర్రులో పుచ్చలపల్లి సుందరయ్య మరియు సుందరరావు మాస్టా రుల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన కాలనీలో సీనియర్ నాయకులు కలవకొల్లు సాంబయ్య, బీసీ కాలనీ గైరబోయిన నాగేశ్వరరావులు సిపిఎం పతకాన్ని ఆవిష్కరిం చారు. సుందరయ్య , సుందరరావు మాస్టర్ల వర్ధంతి సభలో సిపిఎం కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని కట్టేపోగు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సుందరయ్య, సుందర రావు మాస్టారు, కట్టెపోగు సాంబయ్య, శేషగిరిల చిత్రపటాలకు, స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కట్టె పోగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన కడదాకా నిలిచి పోరాడిన అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. 20 సంవత్సరాల పాటు పార్లమెంట్, శాసనసభ సభ్యుడిగా కొనసాగిన సుందరయ్య ఎంతో నిరాడంబరంగా ఉండే వారని, సైకిల్ పై పార్లమెంటుకు, శాసనసభలకు వెళ్లి ప్రజా సమస్యలపై సూటిగా మాట్లాడే వారని అన్నారు. ప్రజాప్రతినిధి అంటే ఎలా ఉండాలో నేటి ప్రజా ప్రతినిధులు సుందరయ్యను చూసి నేర్చుకోవాలని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య 10 లక్షల ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ చేయించారని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య బాటలోనే పయనిస్తూ ఆయన స్ఫూర్తితో నిడమర్రులో ఉపాధ్యాయుడిగా పని చేసిన సుందర్రావు మాస్టారు టీచరుగా, డాక్టర్‌గా , కళాకారుడిగా నిడమర్రు ప్రజల మనసులలో నిలిచిపోయారని అన్నారు. సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఏం భాగ్యరాజు మాట్లాడుతూ రాజధానిలో పేదలు, కూలీల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, వీరికి ఉపాధి చూపించే విషయంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదని అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వలస కూలీలను తీసుకువచ్చి పని కల్పిస్తామని చెబుతున్నారు తప్ప పని కోల్పోయిన స్థానికులకు పని కల్పించేందుకు ప్రయత్నాలు చేయడం లేదని, రాజధానిలో ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి చూపించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని నాయకులు కట్టె పోగు వెంకటేశ్వర్లు గైరబోయిన నాగేశ్వరరావు కట్టిపోగు ప్రకాష్ రావు కట్టె పోగు నాగేశ్వరరావు, మంచి కలపూడి అంకమ్మరావు కుంపటి వీరయ్య కైలా స్టాలిన్ కే బుల్లెబ్బాయి మంచికలపూడి ప్రసన్నకుమార్ కలవకల్లు శ్రీనివాసరావు ఏం రాజ ముని గొల్లపూడి రవి, ఎం సిరిబాబు, కట్టేపోగు నానయ్య కట్టె పోగు సుమతి పాల్గొన్నారు.

అవగాహన ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థలో ఉన్నత విలువలు గల పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు మరలా వస్తేనే వ్యవస్థ ప్రక్షాళన అవుతుందని, అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా 'సోషలిజంతోనే నూతన సమాజం' అన్న అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షోభంలో కూరుకుపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితంగానే రాజకీయ విలువలు సైతం దిగజారిపోతున్నాయన్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమం బలహీన పడిన నేపథ్యంలో అత్యంత లాభదాయకమైన వ్యాపారంగా రాజకీయాలు మారిపోతున్నాయన్నారు మార్కెట్ ఆలోచనా విధానం, అస్తిత్వ రాజకీయాలు, మతోన్మాదం, ఫాసిస్టు రాజకీయాలు పుంజుకుంటున్నాయని, సమాజంలో సైద్ధాంతిక క్షీణత ఏర్పడిందన్నారు. విశ్రాంత టెలికం అధికారి ఎన్. సదాశివం మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట విలువల్లోంచి పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహానుభావులు రాజకీయాల్లో అడుగుపెట్టారన్నారు. సమాజం కోసం త్యాగం చేయటం, ప్రజల పట్ల నమ్రత, పోరాటాల పట్ల నిబద్ధత, మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల ఆచంచల విశ్వాసం పుచ్చలపల్లి సుందరయ్యని గొప్ప నాయకుణ్ణి చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి సింగరయ్య, జనార్ధన రావులు ప్రసంగించారు.

గుంటూరులో కత్తిపోట్ల కలకలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు అరండల్‌పేట 8వ లైను మయూరి బార్ వద్ద మంగళవారం సాయంత్రం ఇరువురి మధ్య జరిగిన చిలికిచిలికి గాలివానగామారి కత్తిపోట్లకు దారితీసింది. స్థానిక పాత గుంటూరుకు చెందిన ఎస్‌కె మాలిక్, ఎస్‌కే అబ్దుల్ అనే ఇద్దరి యువకుల మధ్య ప్రారంభం అయిన మాటల వివాదం చివరికి కత్తిపోట్ల వరకు వెళ్లింది. మాలిక్ అబ్దుల్‌పై 8 కత్తిపోట్లు పొడిచినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే విషయం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు అబ్దుల్‌ను ఆస్పత్రికి తరలించారు. అనంతరం మాలిక్‌తోపాటు వారి స్నేహితులు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకుని అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పాముకాటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి- నకరికల్లు

. పాము కాటుతో ఒక యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు ఎస్టి కాలనీకి చెందిన కాంద్రుకుంట ఆంజనేయులు(37) 18వ తేదీ ఉదయం వర్షం పడుతుండడంతో ఇంట్లో నిద్రిస్తుండగా పాము మెడపై కాటు వేసింది.గమనించిన కుటుంబ సభ్యులు యువకుడిని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడికొండ

భర్త వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధించిన ఘటన మండలంలోని లాం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాం గ్రామంలో నివాసం ఉంటున్న కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కనపర్తి సురేష్ కు గుంటూరు జిజిహెచ్‌లో కాంట్రాక్టు నర్సుగా పనిచేస్తున్న సంకోరు కుసుమ కుమారికి పెద్దలు వివాహం చేవారు. వీరికి ఇద్దరు అడ,ఒక మగపిల్లులు ఉన్నారు. ఈక్రమంలో సురేష్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నాయని, భార్యను వేధిస్తున్నాడని పోలీసులు తెలిపారు. గత ఆరు నెలలుగా భార్య కుసుమను విడాకులు ఇస్తే వివాహేతర సంబంధం ఉన్న మహిళ ధనలక్ష్మిని పెళ్లి చేసుకుంటాను అంటూ మానసికంగా వేధిస్తూ, పెట్టాడని తెలిపారు. గత నెల 18 వ తేదీన ఆమె భర్త, మరో మహిళ ధనలక్ష్మీ తనపై హత్యాయత్నం చేశారని, తాను తప్పించుకుని, జిజిహెచ్‌లో చికిత్స పొంది తనను చంపుతామని బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-తాడికొండ

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటు యువకుని వద్ద రూ.5లక్షల35వేలు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా కాలయాపన చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ వాసు వివరాల ప్రకారం బండారుపల్లి గ్రామానికి చెందిన మధిర రవి కుమార్, డిగ్రీ వరకు చదువుకొని ఉద్యోగంలేక ఖాళీగ ఉంటున్నాడు. గుంటూరు లోని అశోక్ నగర్‌కు చెందిన హోప్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ బాధినీడి పాపారావు ఏపీ హైకోర్టులో ఉద్యోగం కల్పిస్తామని నమ్మబలికి, తప్పుడు ఉద్యోగ నియామక పత్రాలు చూపించి రవి కుమార్ వద్ద నుండి పాపారావు రూ.4,25,000 అతని సన్నిహితుడైన మోతుకూరి అమర్నాథ్ రూ. 1,10,000 మొత్తం రూ. 5,35,000 ను వివిధ సందర్భాలలో తీసుకున్నారని అయితే ఉద్యోగం ఇవ్వకపోగా, ఇచ్చిన డబ్బును కూడా తిరిగి ఇవ్వకుండా నెలల తరబడి ఇబ్బంది పెడుతూ, బెదిరిస్తూ, మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించాడని తెలిపారు. మోసపోయినట్లు గుర్తించిన రవి ఉద్యోగాల పేరుతో మోసం చేసిన బాధినీడి పాపారావు, మోతుకూరి అమర్నాథ్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము-వేజండ్ల
టెండరు ప్రకటన

ఆర్.సి నెం. 10/2025. **తేది. 20-05-2025.**

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలము, వేజండ్ల గ్రామ పంచాయతీ లోని ఈ దిగువ తేల్పిన షెడ్యూలు దాఖలా సామాన్లు సరఫరా చేయుట కొరకు సీల్డు చేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు ది. 28-05-2025 మధ్యాహ్నం 3 గంటలకు సీల్డు చేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు అప్పటికి హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూలు దాఖల ధరావత్తులు చెల్లించి రశీదులను టెండర్లుకు జత చేయవలయును. ధరావత్తులు చెల్లించని టెండర్లు ఆమోదించబడవు.టెండర్లు తిరస్కరించుటకు లేక ఆమోదించుటకు కార్యదర్శి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయము పని చేయు సమయములో సంప్రదించవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు రూ.
1	2025-2026 సం., నకు ప్రజారోగ్య సామాన్లు సరఫరా చేయుటకు	1000-00
2	2025-2026 సం., నకు PWS సామాన్లు సరఫరా చేయుటకు	1000-00
3	2025-2026 సం., నకు స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుటకు	500-00
4	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై స్వీపరుగా పని చేయుటకు 6 పోస్టులు(01-04-2025 నుండి 31-03-2026 వరకు)	50-00
5	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై ఎలక్ట్రీషియన్ గా పని చేయుటకు 2 పోస్టులు (01-04-2025 నుండి 31-03-2026 వరకు)	50-00
6	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై ట్రాక్టరు డ్రైవర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2025 నుండి 31-03-2026 వరకు)	50-00
7	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై ప్లంబర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2025 నుండి 31-03-2026 వరకు)	50-00
8	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై పంపు హౌస్ ఆపరేటర్‌గా పని చేయుటకు 2 పోస్టులు (01-04-2025 నుండి 31-03-2026 వరకు)	50-00
9	2025-2026 సం., నకు టెండరు పద్దతిపై కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేయుటకు 1 పోస్ట్ (01-04-2025 నుండి 31-03-2026 వరకు)	
10	SWPC షెడ్ కు అవసరమైన సామాన్లు సరఫరా చేయుటకు	500-00

షరతులు వర్తిస్తాయి... గమనిక:- గ్రామ పంచాయతీ నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు CFMS ID ద్వారా మాత్రమే వేతనములు మరియు బిల్లులు చెల్లించబడును.

సం//- శరణు వేణుగోపాలరావు
పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, వేజండ్ల

చిలకలూరిపేట పురపాలక సంఘం

Roc.No. 370/Works/2022/E1 **Date : 20-05-2025**

E-Procurement Notice

I. **1. Number of Works : 1** **2. Estimate Contract Value : Rs. 4027087/-**
3. Name of Work :- Construction of Class Rooms at RVSCVS High School in Chilakaluripet Municipality under MPLADs.
4. Bid Document Download Start Date : 21-05-2025 11.00 AM
5. Bid Document Download End Date : 28-05-2025 4.00 PM
6. Bid Submission Closing Date : 28-05-2025 4.30 PM
7. Name and address of the office : Sri. P.Srihari Babu, Commissioner
Chilakaluripet Municipality,
Phone : 08647 - 253994, 9849906585
for other detaisl Visit : https://tender.apeprocurement.gov.in
స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ చిలకలూరిపేట
Sd/- Commissioner,
Chilakaluripet Municipality.

గౌ॥ కోర్టువారి వేలం ప్రకటన
గౌరవ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్)
తెనాలి వారి కోర్టులో
E.P. No. 12/2023 in O.S. No. 763/2021
Between
లింగినేని వెంకటేశ్వరరావు .... డిహెచ్ఆర్
మరియు
గుండాల రాజశేఖర్ .... జెడిఆర్

ఇందుమూలంగా యావన్మందికి తెలియేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి గౌ॥ కోర్టువారు ది. 18-6-2025న బహిరంగ వేలం జరిపెదరు. కావున ఆసక్తి గలవారు ది.18-6-2025న ఉదయం 10-30 గం.లకు పైన పేర్కొన్న న్యాయస్థానంలో హాజరు కాబడి ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తి బహిరంగ వేలంలో పాల్గొనవల సినదిగా తెలియజేయటమైనది.

షెడ్యూలు :-
ఐటమ్ నెం.1 : గుంటూరు డిస్ట్రిక్ట్, తెనాలి రూరల్, అమృతలూరు సబ్ డిస్ట్రిక్ట్, పాంచాలవరం గ్రామ ఏరియా, పాంచాలవరం గ్రామ డి.నెం.113 ఎ.0-65 సెంట్లు మింజుమలె, డో.నెం.2-59 సమీపాన గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :
తూర్పు : రెండవ ఐటమ్ ఆస్తి
దక్షిణం : జెడిఆర్ గారి ఆస్తి
పడమర : గుండాల సుబ్బారావు గారి ఆస్తి.
ఉత్తరం : గుండాల శ్రీనివాసరావు గారి ఆస్తి.
ఈ నాలుగు హద్దుల మధ్యగల చ.గ. 145.20 లేక చ.మీ. 121-38ల ఖాళీ నివేశన స్థలము.
ఐటమ్ నెం.2 : గుంటూరు డిస్ట్రిక్ట్, తెనాలి రూరల్, అమృతలూరు గ్రామపంచాయతీ ఏరియా, అమృత లూరు గ్రామ డి.నెం.113 ఎ.0-65 సెంట్లు మింజుమలె. డో.నెం. 2-59 సమీపమున గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :
తూర్పు : గమిని శ్రీనివాసరావుగారి ఆస్తి.
దక్షిణం : జాయింటు గల్లీ
పడమర : 1వ ఐటమ్ ఆస్తి
ఉత్తరం : జాయింటు గల్లీ.
ఈ నాలుగు హద్దుల మధ్యగల చ.గ. 24-2లు లేక చ.మీ. 207లు, 1 మరియు 2 ఐటమ్‌లు ఏక ఖండముగా వున్నందున మొత్తము చ.గ. 169.21 లేక చ.మీ. 141.61ల ఖాళీ నివేశన స్థలము.
డిహెచ్ఆర్ విలువ : రూ.7,00,000/-
అమీనా విలువ : రూ.9,00,000/-
మార్కెట్ విలువ : రూ.1,69,000/-
ఇ.సి. దాఖలా అన్యాక్రాంతములు లేవు.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వేలంతేది : 18-6-2025
తదుపరి విచారణ : 25-6-2025

నన్నపనేని మాధవరావు,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
తెనాలి, గుంటూరుజిల్లా.
సెల్ నెం : **9493244**

బహిరంగ ప్రకటన

సత్తెనపల్లి అప్పారావు తండ్రి పెద్ద చంద్రయ్య అనునేను తెలియ చేయునది. నా యొక్క ఖాళీ స్థలంకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నం.16635/2024 ను తేదీ. 19.05.2025న గంగన్నపాలెం గ్రామము నుండి తీసుకొని కావురు వరకు వచ్చి చూసుకొనగా కనిపించలేదు. ఆ డాక్యుమెంట్ మార్గమధ్యలో ఎక్కడో పడి పోయినది. ఎంత వెతికినను కనిపించ లేదు.
నా యొక్క అడ్రస్సు:-
సత్తెనపల్లి అప్పారావు తండ్రి సత్తెనపల్లి పెద్ద చంద్రయ్య, సెల్ నం.9493243746.

ప్రకటన

ఇందుమూలంగా గుంటూరుజిల్లా, తాడేపల్లి మండలం, మెల్లెంపూడి గ్రామ వాస్తవ్యులు, ఆళ్ళ వెంకట పూర్ణారెడ్డి గారి కుమారుడు ఆళ్ళ శివ శంకరరెడ్డి గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా..
ది. 9-2-2015వ తేదీన మా క్లయింట్ తల్లిగారైన ఆళ్ళ అన్నపూర్ణమ్మగారు క్రయ దస్తావేజు ద్వారా సంక్రమించిన దిగువ షెడ్యూలు ఆస్తిని మా క్లయింటు పేరున రిజిష్టరు వీలునామా నెం.221/2015 బుక్ 3 వ్రాసి ది. 14-4-2025వ తేదీన పరమ పదించారు. నాటి నుండి సదరు ఆస్తి మా క్లయింటుకు సర్వ హక్కులతో సంక్రమించి వున్నదని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. సదరు ఆస్తి మా క్లయింట్‌కు చెందుట ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలో ఈ క్రింది వారికి తెలుపగలరు. గడువు పిదప వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవు.
షెడ్యూలు : గుంటూరుజిల్లా, తాడేపల్లి మండలం, మెల్లెంపూడి గ్రామ సర్వే నెం. 192సిలో య. 0-26 సెంట్ల భూమికి హద్దులు :
తూర్పు : తుంగభద్రవాగు
దక్షిణం : లంకిరెడ్డి సాంబిరెడ్డి వగైరాలు
పడమర : భీమిరెడ్డి నాగ మల్లేశ్వరమ్మ
ఉత్తరం : దొంతిరెడ్డి వెంకటరెడ్డి

ఇట్లు
కుర్మాల దుర్గా ప్రసాద్,
కుర్మాల బాలసాయి
అడ్వకేట్స్,
పార్కురోడ్డు, మంగళగిరి.
సెల్ నెం : **9848148573, 9705402285**

కార్మిక హక్కులు, పంటలకు ధరల కోసం నిరసనలు

ప్రజాశక్తి - మాచర్ల

కార్మికులను ఇబ్బందులకు గురిచేసే 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, అసంఘటిత కార్మిక రంగంలో పనిచేసే వారికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఆందోళనలో భాగంగా మంగళవారం సిఐటియు, సిటియు, ఎంసిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు ఏరియా కార్యదర్శి బండ్ల మహేష్, సిటియు నాయకులు అబ్రహం లింకన్, ఎంసిపిఐ నాయకులు నాగేశ్వరావు మాట్లాడుతూ కార్మిక, కర్షక, రైతు, రైతు కూలి తదితర ప్రజా వ్యతిరేక విధానాల అమలు వేగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నాయని విమర్శించారు. బడా పారిశ్రామిక వ్యక్తులకు బహుళ ప్రయోజనాలు, కష్టం చేసే వారి శ్రమ దోపిడీకి వీలుగా విధానాలుంటున్నాయన్నారు. వందల్లో ఉండే పారిశ్రామిక వేత్తలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం అదేసమయంలో కార్మికుల హక్కులను హరించేలా లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజపై అనేక రకాల పేన్నులేసే ప్రభుత్వాలు కనీస వేతనాలను ఎందుకు పెంచవని నిలదీశారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని బ్యాంక్ సెంటర్ నుండి కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో నల్ల కండువులు ధరించి నిరసన ప్రదర్శన హైలాండ్ సెంటర్ వరకు నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్ కోడ్స్ అమలు చేయడానికి దూకుడుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రైతులకు, కార్మికులకు కష్టాలు తెచ్చే రోజులు తెచ్చిందని విమర్శించారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాట సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, పనిగంటలు పెంచి, ఇతర సౌకర్యాలను రద్దు చేసే లేబర్ కోడ్‌లను తేవడం అంటే కార్మిక హక్కులను కాలరాయటమేనని అన్నారు. వ్యవసాయం రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, కార్మిక చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని, ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు పెంచి, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, దీన్ని పట్టణ ప్రాంతానికి విస్తరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఎఫ్‌టియు (న్యూ) నాయకులు కె.చెన్నయ్య, సిఐటియు నాయకులు ఒ.కృష్ణ, వివిధ సంఘాల నాయకులు స్వామి, డి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, వెంకయ్య, నాగేశ్వరరావు ,సైదావలి, కృష్ణ, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో చేజర్ల సచివాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి పిచ్చారావు మాట్లాడుతూ అన్ని రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల చట్టాలకు చేసిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టు కోటేశ్వరరావు, రామంజి నాయక్, సోముల నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు ఆయా సంఘాల నాయకులు వినతిపత్రాలు ఇచ్చారు. మిర్చి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతు అమ్ముకున్న ధరకు మధ్య తేడాను వెంటనే ఇవ్వాలని, ఈ-క్రాప్ ఆధారంగా రూ.5000 బోనస్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులను గుర్తించటం. అన్నదాత సుఖీభవ పథకం ఒకేసారి రూ.20 వేలను ఇవ్వాలని కోరారు. బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ మేరకు పెదకూరపాడులోని మూడు సచివాలయాల్లో, లింగంగుంట్ల సచివాలయంలో, లగడపాడు, గారపాడు హుస్సేనగరం సచివాలయాల్లో వినతిపత్రాలిచ్చారు.

రక్తదానాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తదితరులు

ప్రభుత్వ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కృత్రిమంగా తయారు చేయలేని రక్తం దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్, కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి ప్రారంభించారు. జెసి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర సమయాలలో రక్తం అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం రక్తం కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వ బాధ్యతగా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సంస్థల ద్వారా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. డిఆర్‌ఒ మురళి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో మండలాల వారీగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఒక సర్క్యులర్ విడుదల చేశామన్నారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, కెఎంఎన్ వి.శ్రీనివాస గుప్తా, బి.మురళి, డాక్టర్ రహమతుల్లా జిల్లా కలెక్టర్ సహకారంతో రక్తదాన శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిబిరంలో 43 మంది రక్తదానం చేయగా రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌ఆర్.సి కుమార్, ఏఓ ఎం.లీలసంజీవకుమారి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రసూన, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని రాజీవ్ రజక కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులకు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా పథకం ద్వారా రూ.19.89 లక్షలతో 250 ఇళ్లకు సురక్షిత జలాలు సరఫరా చేసేలా పైప్ లైన్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే అమృత్ పథకంలో కాలనీలకు నీటి సరఫరా మెరుగుకు పనులు ప్రారంభించామన్నారు. మల్లికార్జునరావు సహకారంతో ఈ రజక కాలనీ ఏర్పాటైందని, దీన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తాను చూసుకుంటానని చెప్పారు. త్వరలో అంతర్గత రోడ్లు, అంగన్వాడీ కేంద్రం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ కాలనీ ఏర్పాటు చేశామని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జీవీ ఆంజనేయులు కూడా ఈ కాలనీ ఏర్పాటుకు సహకరించారని చెప్పారు.

ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాలలో తొలిరోజైన సోమవారం రాత్రి ముప్పాళ్ల చెన్నయ్య, రాపర్ల శ్రీనివాసరావు కళాప్రాంగణంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ జి.లీలావతి జ్యోతి ప్రజ్వలన చేయగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రదర్శనలను ప్రారంభించారు. భార్య మాటలు విని కన్న ప్రేమను మరిచిన కొడుక్కి కళ్లు తెరిపించే తల్లిదండ్రుల కథ ఇతివృత్తంగా 'కిడ్నాప్' నాటికను చెరుకూరి సాంబశివరావు దర్శకత్వంలో ఉషోదయ కళానికేతన్ కాట్రపాడుకు చెందిన కళాకారులు ప్రదర్శించారు. మాధవ్ రచించిన 'జనరల్ బోగీలు' నాటికను గోపరాజు విజయ్ దర్శకత్వంలో కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. రైళ్లలో సామాన్య ప్రయాణికులు కష్టాలను ఈ నాటిక కళ్లకు కట్టింది. ప్రదర్శనలకు డిఎల్డిఏ మాజీ చైర్మన్ ఎల్.వెంకట్రావు, న్యాయవాది ముప్పాళ్ల జ్ఞానేశ్వర్రావు కుటుంబ సభ్యులు ప్రోత్సాహక పారితోషికాన్ని అందజేశారు. నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా బేగం, పీవీ. సురేష్‌బాబు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, ఎం.మరియదాసు, జి.రేవతి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, లాయర్ సైదారావు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులానికి ఐదెకరాల కేటాయింపు

ప్రజాశక్తి - రెంటచింతల : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్మాణానికి మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ సమీపంలో ఐదెకరాలు కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు మంగళవారం నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు రూ.4.10 కోట్లు కేటాయించారన్నారు. మిట్టగుడిపాడు కస్తూరిబా పాఠశాల సమీపంలో 447/3 సర్వే నంబర్లలో 6.50 ఎకరాలు ఉండగా అందులో ఐదెకరాలను ఐటిడిఎకు ఇచ్చారన్నారు. ప్రస్తుతం టెండర్ల దశ ప్రారంభం కాబోతుందని జూన్ 5 నుంచి కాంట్రాక్టర్ ఒప్పంద పత్రాలు రాసి పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. మొదటి దశలో 16 తరగతి గదులు, డార్మెటరీ, ఆట స్థలం, అంతర్గత రహదారులు నిర్మించున్నట్లు తెలిపారు. 2020 జులైలో 1.45 కోట్లు విడుదలైనా స్థల సేకరణలో జాప్యం వల్ల ఆ నిధులు వెనక్కువెళ్లినట్లు పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టర్ నీలం రాజుకు ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి - వెల్దుర్తి

వేదిక స్వదేశమైనా, విదేశమైనా క్రీడా పోటీల్లో దూసుకుపోవాలని నియోజకవర్గ క్రీడాకారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ కొమెర నీలంరాజుకు రూ.లక్ష, 61 వేల 200ను అందజేశారు. పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టర్లను అభినందించారు. ఈ ఏడాది జనవరి 31 న ఉత్తరాఖండ్ లో 67 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో నీలం రాజు గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీలం రాజును ఎమ్మెల్యే సన్మానించారు. భవిష్యత్తు పోటీలకు ఏ అవసరం ఉన్నా సహకరిస్తారని హామీ ఇచ్చారు. వెయిట్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసుకోవడానికి ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ బార్ బేరింగ్ సెట్ లిఫ్టింగ్ వెయిట్స్ కావాలని ఎమ్మెల్యేను నీలంరాజు కోరగా అందుకు నగదును అందించారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకేశవ యాదవ్, హనుమాన్ జిమ్ నిర్వాహకులు ఆదివిష్ణుయాదవ్, వెయిట్ లిఫ్టర్స్ మంజుల అశోక్, కందుకూరి హేమావతి, అప్పల మల్లికార్జునరావు, రాకేష్ రణధీర్ యాదవ్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నియోజకవర్గ పరిధిలో 34 మందికి రూ.39 లక్షలు 93 వేల 320 సిఎం సహాయనిధి మంజూరైంది. లబ్ధిదార్లకు చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థానిక తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు.

కార్మికుల పొట్ట కొట్టే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు - ర్యాలీలు

ప్రజాశక్తి - మంగళగిరి

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళగిరిలో మంగళవారం సాయంత్రం సిఐటియు, వైయస్సార్ టి యు, ఏఐటీయూసీ, ఏఐఎఫ్టియు న్యూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఏఐటీయూసీ నియోజకవర్గం కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, వైయస్సార్ టి యు నియోజకవర్గ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరాజు, ఏఐ ఎఫ్టియూ న్యూ నాయకులు కే కోటేశ్వరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రైతాంగ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. పని గంటల భారం పది గంటల నుండి 12 గంటల వరకు పెరుగుతుందన్నారు. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, వైయస్సార్ టి యు నాయకులు కే తిరుమలేశ్వరరావు, డి అమరేశ్వర రావు, ఏఐ ఎఫ్టియు న్యూ నాయకులు వి దుర్గాప్రసాద్, ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటిఎం సీ పరిధిలోని ప్రాతూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద కార్మిక, రైతు సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిఐటియు నాయకులు పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రైతాంగ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు పండించిన పంటలకు మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో అమలయ్యే విధంగా చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ విధానా లను రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నప్పటికీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశంగా ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకురావడం అన్యాయమని అన్నారు. స్థానికంగా తాడేపల్లి మండలంలో పంట పొలాలకు నీరు అందించే ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలవ లో మురుగునీరు వచ్చి చేరిన పట్టించుకునే నాధుడే లేడని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ పంటలకు సాగునీరు అందించే పంట కాలవను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. చిర్రావూరిలో పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్ లేకపోవడంతో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పశు వైద్యున్ని నియమించాలని అన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణీకరణ పేరుతో నిలిపివేసిన ఉపాధి హామీ పథకం పనులను గ్రామాలతో పాటు, పట్టణంలో కూడా ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రైతు నాయకులు అమ్మిశెట్టి రంగారావు, టి బక్కిరెడ్డి, డోకిపర్తి రాజేంద్ర బాబు, రత్తయ్య, గోపాలం శంకర్రావు, సుబ్బారావు, శివయ్య, కపారావు, సంకురు జూలీ రాజ్, అమ్మిశెట్టి అర్జునరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సిఐటియు మరియు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి తాసిల్దార్ కార్యాలయం గేటు ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా జరిగిన సభకుసిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు బూరుగ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిఐటి యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతు కనీస వేతనం చట్టం ప్రకారం కార్మికులకు 26000 వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జులై 9 వ తేదీ ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ సమ్మె జరుగుతుందని తెలిపారు. సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలనీపిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే బాబురావు, బి సూర్యప్రకాష్, కే స్టీవెన్, కే లక్ష్మి, బి బాబురావు, బి రేణుక, బి కమల, జి కొండయ్య, కే వెంకమ్మ, పి సంతోషం, ఇసుకపల్లి ఇసాక్, డి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కే వెంకటయ్య, వైయస్సార్ టి యు నాయకులు ఆర్ శ్రీనివాసరాజు అంగన్వాడి, ఆశ, సిమెంట్ కంపెనీ, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఎర్రబాలెం నిడమర్రు గ్రామాలలో నిరసన తెలిపారు. నిరసనలో రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్ లను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికు లు ఎన్నో త్యాగాలు చేసి, ప్రాణాలను సైతం బలిదానం చేసి సాధించుకున్న హక్కులను, కార్పొరేట్ల మెప్పుకోసం పాలకులు కాలరాయాల నీ చూస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి బాబు ఓ రామారావు టీ ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎం పార్వతి ఎస్ కే సుభాని టి తిరుమలేష్ శివకోటి పాండు వెంకటేశ్వరరావు ధనమ్మ బాలమ్మ లక్ష్మమ్మ పండు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

నాలుగులేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని మేడికొండూరులో నిరసన తెలిపారు.

మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో నిరసన

ప్రాతూరు రోడ్డులో నిరసన చేస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులు

తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద వర్షంలోనూ నిరసన చేస్తున్న వివిధ రంగాల కార్మికులు

ఎర్రబాలెంలో నిరసనలో మాట్లాడుతున్న ఎం.రవి

తెనాలిలో

కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు బి రామకృష్ణ, సిఐటియు నాయకులు ధనలక్ష్మి ఇమామ్ రీప్, టి. టాన్యా, వెంకటేశ్వర్లు, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కార్మికుల చట్టాలను తుంగలో తొక్కుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎపి స్టేట్ బ్రేవరేజెస్ ఐఎంఎఫ్ తెనాలి డిపో వద్ద ముఠా కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్ లుగా మరల్చడంపై శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ అన్నారు. ఉద్యమ స్ఫూర్తిని తిరిగి పునఃప్రారంభం చేసుకోవడానికి కొంత సమయం పడుతుందని కార్మికులకు తెలియజేసారు. దేశంలో విద్రోహుల కలహాలు నేపథ్యంలో సార్వత్రిక సమ్మె వాయిదా పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో చెంచుపేట హమాలీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని కోరుతు తాడికొండలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు చింతల భాస్కరరావు రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, జోజి,సుబ్బారావు, రమేష్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడికొండలో

మేడికొండూరులో నిరసన ర్యాలీ

నేటి నుండి గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

నేటి నుండి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. తప్పనిసరి బదిలీ అయ్యేవారు, హేతుబద్దీకరణకు గురయ్యే వారు, రిక్వెస్ట్ బదిలీలు కోరుకునే వారు నేటి నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి సిద్ధంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఈబదిలీలు జరగ నున్నాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీ యాజమాన్యాల్లోని పనిచేస్తున్న గ్రేడ్-2 హెఎంలకు బదిలీలు చేపడుతున్నారు. జిల్లాలో 5గానీ, 8 సంవత్సరాలుగానీ పూర్తి చేసుకున్న వారు అన్ని యాజమాన్యాల్లో కలిపి 40 మంది ఉన్నారు. అలాగే పూర్తి ఖాళీలు 53, కొత్తగా మంజూరైన పోస్టులు 32, ఇతర ఖాళీలు అన్ని కలుపుకొని 128 ఉన్నాయి.

టిడిఆర్ బాండ్లు అందని వారు వివరాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో జిఎంసికి స్థలాలను గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టిడిఆర్ బాండ్లు అందించడం జరుగుతుందని, అందని వారు నగరపాలక సంస్థ సిటి ప్లానర్‌ని కలిసి వివరాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో అనేక ప్రాంతాల్లో డొంకరోడ్, కొత్తపేట, కుగ్లర్ హాస్పిటల్ రోడ్, ఏటి అగ్రహారం, పలకలూరు రోడ్, నందివెలుగు రోడ్, రామనామ క్షేత్రం రోడ్, జేకేసి కాలేజి రోడ్ తదితర రోడ్ల విస్తరణ పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా విస్తరణ ప్రభావిత భవన, స్థల యజమానులకు టిడిఆర్ బాండ్లు అందిస్తామని, కాని కొందరు గతంలో విస్తరణ చేపట్టిన రోడ్లకు సంబందించి బాండ్లు అందలేదని పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ ల్లో అర్జీలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కనుక అటువంటి వారు కార్యాలయ పనివేళల్లో జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు (98499 08390)ను కలిసి తగిన వివరాలు అందిస్తే పరిశీలించి బాండ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిర్చి యార్డులో అవినీతిపై విచారణ చేయండి

జెసికి గళ్లా మాధవి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి హయా ంలో మిర్చి యార్డులో జరిగిన అక్రమాలు, అడ్డగోలు లైసెన్స్ మంజూరు పై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ తేజకు మంగళవారం వినతి పత్రం సమర్పిం చారు. ఈ సందర్భ ంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసిపి హయంలో అడ్డ గోలుగా లైసెన్సులు మంజూరు చేశారన్నారు. వైసిపి హయంలో మిర్చి యార్డును అడ్డాగా చేసుకుని పలువురు నాయకులు దోచుకున్నారని అన్నారు. ఇప్పటికే 683 లైసెన్సులు ఉన్నాయని వీటిల్లో 200 లైసెన్సులు అర్హత లేని వారికి ఇచ్చారన్నారు. దీనిని బినామీ పేర్లతో ఒక్కొటి రూ.20 లక్షలకు అమ్ముకున్నారన్నారు. జిరో బిల్లుల రూపంలో రూ.64.46 కోట్లు, అక్రమ బిల్లుల ద్వారా రూ.32.23 కోట్లు, కటింగ్ బిజినెస్ ద్వారా రూ.38.68 కోట్లు, ఇతర లావాదేవీల ద్వారా మరో రూ.ఐదు కోట్లు స్వాహా చేశారన్నారు. రైతులకు అందించే ఉచిత భోజనాల్లో కూడా అక్రమాలకు పాల్పడ్డారన్నారు. మొత్తం రూ.141.88 కోట్ల అవినీతి జరిగిందన్నారు. 2019నుంచి 2024 మధ్య కాలంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలన్నారు. ఈమేరకు వ్యవసాయ శాఖ మంత్రి, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలిపారు.

ఇన్‌ఛార్జి కలెక్టరు భార్గత తేజకు వినతిపత్రం ఇస్తున్న గళ్ళా మాధవి

ఐటిసి ఎదుట 27న పొగాకు రైతు దీక్షలు

సాగర్ కాల్వలను విస్తరించాలి - రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు

ప్రజాశక్తి -చిలకలూరిపేట

రైతుల వద్ద ఉన్న పొగాకును ఐటిసితోపాటు అన్ని పొగాకు కంపెనీలు కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్దగల ఐటిసి కంపెనీ వద్ద ఈనెల 27న దీక్షలు చేపట్టనున్నట్లు రైతుసంఘాలు ప్రకటించాయి. దీనిపై స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ మంగళవారం నిర్వహించారు. సమావేశానికి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించి మట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చిలకలూరిపేట నియోజకవర్గంలోనే ఎక్కువగా పొగాకు సాగైందని, రైతుల్లో అధిక శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన సన్న చిన్నకారు రైతులని చెప్పారు. వ్యవసాయ శాఖకు సరైన ప్రణాళిక లేనందున ఎక్కువ మంది రైతులు బర్లీపొగాకు సాగు చేశారని, మళ్లీ వ్యవసాయం సీజన్ ప్రారంభం అవుతున్నా పొగాకును కంపెనీలు కొనకపోవడంతో అప్పులపాలైన సాగుదార్లు ఆతహత్యలకు పాల్పడే దుస్థితి నెలకొందని చెప్పారు. పొగాకు కొనుగోలుపై సిఎం, వ్యవసాయ శాఖ మంత్రి హామీనిచ్చినా చర్యల్లేవన్నారు. ప్రభుత్వం సత్వరమే ప్రత్యేక నిధులు కేటాయించి కొనుగోలు చేయాలన్నారు. చిలకలూరిపేట ప్రాంతంలో సాగర్ కాల్వలను విస్తరించి అన్ని ప్రాంతాలకు నీరందించాలన్నారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ అమెరికా, యూరప్ దేశాల్లో సిగరెట్ తయారీకి నల్లబర్లీ పొగాకు వాడతారని, దీన్ని తక్కువ ధరకు కొనడానికి కంపెనీలే సిండికేట్ అయ్యి దళారుల ద్వారా కొనాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలు సరిగా లేనికారణంగానే పంటలకు ధరలు తగ్గాయన్నారు. గతంలో రెండూ మూడెకరాల పొగాకు సాగుచేసిన రైతులు ఈ ఏడాది కంపెనీల మాటలు నమ్మి 10-15 ఎకరాలు కౌలుకూ తీసుకుని సాగుచేశారని, ఇప్పుడు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అనంతరం సిపిఐ ఏరియా కార్యదర్శి టి.బాబురావు, సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సిపిఐ మహిళా సంఘం నాయకులు నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్.లూథర్, ఎఐటియుసి ఏరియా కార్యదర్శి డి.వరహాలు మాట్లాడారు. ఉపాధి హామీకి కేంద్ర నిధులు పెంచాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చేసే ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ ప్రకటించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు షేక్ సుభాని, మల్లికార్జున్, పి.భారతి, పి.శివగణేష్, అంజయ్య పాల్గొన్నారు.

పిడుగుపాటు మృతురాలి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ (32) ఈ నెల 14వ తేదీన కూలి పనులకు వెళ్లిన సందర్భంలో పిడుగు పడి మృతిచెందిన నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 వేలను అందజేశారు. మిగతా నష్టపరిహారాన్ని కూడా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో మధులత, తహశీల్దార్ జె.విజయశ్రీ, టిడిపి నాయకులు కె.సాయిబాబు పాల్గొన్నారు.

26న ఎరువుల వేలం

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని ఇంటిగ్రేటెడ్- అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షించిన నాణ్యమైన రసాయన ఎరువులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు ఎడిఎ ఆధ్వర్యంలో యూరియ, కాంప్లెక్స్ రసాయన ఎరువులు మొత్తం 61.600 కిలోలను వేలం వేస్తామని పేర్కొన్నారు.

ప్రతిగ్రామంలోనూ బాల పార్లమెంట్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - క్రోసూరు

లింగవివక్షపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ అమ్మాయికి 19 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే పెళ్లి చేయాలన్నారు. అదే విధంగా ఆడపిల్లలకి ఎలాంటి సమస్యలు ఉన్నా 100, 1982 లాంటి లాంటి ట్రోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం, సహాయం పొందొచ్చని చెప్పారు. అమ్మాయిల్ని కూడా అబ్బాయిలతో సమానంగా చూడాలని, వారికాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో బాల పార్లమెంట ఏర్పాటు చేసి పిల్లలందరికీ చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, బాలల హక్కులు, బాధ్యతల గురించి తెలపాలన్నారు.బాలికల యుక్త వయస్సులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త అనురాధ, మేరీ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : అనారోగ్యంతో మృతి చెందిన విజయపురిసౌత్‌కు చెందిన అంకాల కోటేశ్వరరావు (60) కుటుంబాన్ని టిడిపి నాయకులు మంగళవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని సీనియర్ నాయకులు గుండాల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పరామర్శించిన వారిలో బసివిరెడ్డి, సత్తిబాబు, వెంకటేశ్వర్లు, నర్సింహులు, కృష్ణ, బాలస్వామి, బుద్ధారెడ్డి, జగదీష్, శ్రీను, రామాంజనేయులు, పవన్ ఉన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట చాగంటివారిపాలేనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మధిర రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం రోజునే తన మనుమడు మధిర భార్గవ రామిరెడ్డి జన్మదినం రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మారూరి శ్రీనివాసరెడ్డి, పూజల రామలింగయ్య,రుద్రపాటి రామకృష్ణ, గురునాధం, నీలం నాగేశ్వరరావు, కోటయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేయడంతోపాటు ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు, బ్రెడ్లను అందించారు. సాయంత్రం శ్రీశైలం రోడ్డులోని శ్రీరామకృష్ణసేవా సమితి అనాధ ఆశ్రమంలో పిల్లలకి, వృద్ధులకు భోజనం సమకూర్చారు. కార్యక్రమాల్లో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ షేక్ సైపుల్లా, రవికుమార్, వాసు, హుస్సేన్, విజయ్, బంగారం, రామ్, లక్ష్మణ్ నరేంద్ర పాల్గొన్నారు.

వైసిపి బీసీ సెల్ జనరల్ సెక్రెటరీగా రాజవర్గం నాగేశ్వరరావు

ప్రజాశక్తి-సత్తెనపల్లి : వైసిపి బిసి సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సత్తెనపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయినట్లు శివనాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన వైసిపి గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఆర్.రమేష్ యాదవ్, వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జెల సుధీర్ భార్గవరెడ్డి, వైసిపి లీగల్ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆర్.మాదవి, ఎస్సీ సెల్ నాయకులు ఎస్.గాంధికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని 139 బీసీ కులాలను ఏకం చేసి 2029లో జరగబోవు ఎన్నికలలో వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు.

పల్నాడులో నెలకు 50 రోడ్డు ప్రమాదాలు

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో నెలకు సగటున 50 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని సత్వరమే 25కు తగ్గించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా రహదారి భద్రత కమిటీ, మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నరసరావుపేట కలెక్టరేట్‌లో ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023లో 576, 2024లో 612 రోడ్డు ప్రమాదాలు వాటిల్లగా 2025 ఏప్రిల్ నాటికి 263 ప్రమాదాలు జరిగాయన్నారు. 2024లో రోడ్డు ప్రమాదాలలో 380 మంది మరణించగా 2025లో 4 నెలల కాలంలో 152 మరణాలు సంభవించినట్లు వివరించారు. ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు అత్యధిక ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులతో నడిచే వాహనాలు, మైనర్ డ్రైవింగ్, అతివేగం, మద్యం ప్రభావంలో వాహనాలు నడపడంపై ఉక్కుపాదం మోపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు అన్ని రోడ్లపై తనిఖీలు నిర్వహించాలన్నారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారులు రాష్ట్ర రహదారులపై వాహనాలు నిలిపి, డ్రైవర్లను నిద్రలోకి జారుకోకుండా జాగ్రత్తలు చెబుతూ నిర్వహిస్తున్న స్టాప్ అండ్ వాష్ కార్యక్రమం మంచి ప్రభావం చూపుతోందన్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. అయితే జిల్లా రోడ్లు, గ్రామీణ రోడ్లు వంటి ఇతర రహదారుల్లో ప్రమాదాలు పెరిగాయని చెప్పారు. జిల్లాలోని 34 బ్లాక్ స్పాట్లలో ఏర్పాటు చేసి సిసి కెమెరాలు రోడ్డు ప్రమాదాల సరళిని మెరుగ్గా అంచనా వేయడంలో తోడ్పడుతున్నాయన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మొద్దు

ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అమ్మకాలను నిరోధించాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన హాట్ స్పాట్‌లలో సీసీ కెమెరాలు, డ్రోన్‌తో పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జూనియర్ కళాశాలలు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, రోడ్లు-భవనాల శాఖ ఎస్ఇ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, డిఇఒ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రుణాలపై సమీక్ష

ఈ ఏడాది జనవరి నుండి మార్చి వరకు త్రైమాసిక మాసానికి సంబంధించి డిసిసి (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ) డిఎల్ఆర్‌సి (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ)పై బ్యాంకర్లతో నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ పిఎంజెజెవై, పిఎం జన్‌ధన్ యోజన వంటి పథకాల్లో ఎన్ని యాక్టివ్‌గా ఉన్నాయి. ఎన్ని ఇన్ యాక్టివ్‌గా ఉన్నాయి వివరాలు అడిగారు. త్రైమాసికానికి జిల్లాలోని 310 బ్యాంకులలో మార్చి నాటికి రూ.41,995.38 కోట్ల వ్యాపారం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం ప్రసాద్ తెలిపారు. జన్‌ధన్ యోజన కింద 531755 రూపే కార్డులు మంజూరు చేశామని, వార్షిక క్రెడి ప్లాన్ కింద రూ.22910.84 కోట్ల రుణాలిచ్చామని చెప్పారు. షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ కింద 830687 మందికి రూ.10683.56 కోట్లు ఇచ్చామని, కౌలు రైతులు 3388 మందికి రూ.23.89 కోట్లు మంజూరు చేశామని, ఉన్నత చదువులకై 2024-25 విద్యా సంవత్సరంలో 1478 ఖాతాదారులకు రూ.71.49 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ టి.మాధురి, ఆర్.బి.ఐ అధికారి అభిషేక్ రాజ్, నాబార్డు డిడిఎం సి.శరత్‌బాబు వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సత్వరమే సగానికి తగ్గించాలి : కలెక్టర్ - బ్యాంకుల రుణాలపై ఎంపీతో కలిసి సమీక్ష

అప్రకటిత విద్యుత్ కోతలు

బిల్లుల వసూళ్లు ఘనం.. సరఫరా అధమం

అనధికార విద్యుత్ కోతలతో ప్రజల ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - తెనాలి

విద్యుత్ బిల్లులను గణనీయంగా వసూలు చేస్తున్న ప్రభుత్వం, విద్యుత్ సరఫరాలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. వేసవి తీవ్రతకు ఒకవైపు ప్రజలు అల్లాడుతుంటే, వేళా పాళా లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఒకవైపు మండుటెండలు, వేడి తీవ్రతకు తట్టుకోలేక వద్ధులు చిన్నారులు అల్లాడిపోతున్నారు. కనీసం విద్యుత్ సరఫరా లో అంతరాయాన్ని ముందుగా ప్రకటించే తీరిక కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పట్టణ గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయి. కనీసం సరఫరా నిలిపివేసే వివరాలను ముందుగా ప్రకటించడంలో కూడా అధికారులు విఫలమవుతున్నారు. ఒక్క శనివారం మాత్రం మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పటం మినహా మిగిలిన సమయాలలో విద్యుత్ కోతలపై స్పష్టత ఉండటం లేదు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు మారుతూ ఉండటం, అకస్మాత్తుగా వర్షాలు, ఈదురుగాలులు రావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. పునరుద్ధరణ చర్యలు కూడా అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ముఖ్యంగా రూరల్ గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉంది. ఈ నెలలో ప్రతిరోజు విద్యుత్ కోత ఉంటూనే ఉంది. సమయపాలన

ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులో సిబ్బంది

ఉండదు. రోజు మొత్తం మీద కనీసం రెండు మూడు గంటలు ప్రజలు విద్యుత్ కోతను ఎదుర్కొంటున్నారు. గత పది రోజులుగా సాయంత్రం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు అనధికార విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. రూరల్ గ్రామం కొలకలూరు లో ఈనెల 17న ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సాయంత్రం ఏడు గంటల వరకు కూడా పునరుద్ధరణ లేదు. విద్యుత్ అధికారులకు ఫోన్లు చేస్తే సరైన సమాధానం లభించడం లేదని, పైగా మా దృష్టికి ఇప్పుడే సమస్య వచ్చిందని, పరిశీలిస్తామంటూ బదులిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కొలకలూరు ఎస్సీ కాలనీ ప్రారంభంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ పై అధిక లోడు ఉంది. దీంతో తరచుగా విద్యుత్ సమస్యలు ఎదురవు తున్నాయి. దీనికి తోడు గుడివాడ గ్రామానికి చెందిన లోడును కూడా ఈ ట్రాన్స్ఫార్మర్ కు మళ్ళించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ట్రాన్స్ఫార్మర్ మార్చినట్లు అధికారులు చెబుతున్న పరిస్థితిలో మార్పు లేదు. ట్రాన్స్ఫార్మర్ నిర్వహణ లోపమే సమస్యకు కారణమని విద్యుత్ సిబ్బందే వ్యాఖ్యానించటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలని కోరుతున్నారు.

గాలులు వర్షాలతోనే మరమ్మతులు

బి.అశోక్ కుమార్, డి ఈ, తెనాలి

ఈదురు గాలులు, అకాల వర్షాలకు తీగలు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. మరమ్మతుల కారణంగానే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ప్రస్తుతం కూడా రూరల్ ప్రాంతంలో మరమ్మతులు జరుగుతున్నాయి. కొలకలూరు విద్యుత్ సమస్యకు సంబంధించి ట్రాన్స్ఫార్మర్ను ఇటీవలే మార్పు చేశాం. ఏదైనా విద్యుత్ సరఫరా లో ఇబ్బంది లేకుండా చూస్తాం.

దీక్షలో పాల్గొన్న కార్మికులు

168 రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 168 రోజుకు చేరు కున్నాయి. దీక్షలో టీ దుర్గ భవాని, వై రమాదేవి, ఎం శివకుమారి, ఎస్ కే ఇమాంబి, ఈ చారమ్మ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, వై సాంబయ్య, తుపాకుల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయస్థానాల తీర్పు ను గౌరవించైనా ప్రభుత్వాలు కార్మికుల సమస్యను పరిష్క రించాలని కోరారు. ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా 360 కుటుంబాలకు న్యాయం చేసిన వారు అవుతారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే కాసిం, ఎం గురవయ్య, డి నాగేశ్వరరావు, సుభాని, ఎండి ఇస్మాయిల్, ఆర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ఓ సి చెక్కులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

రోగులకు ఎల్వోసీ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. మంగళగిరి పట్టణంలోని టిప్పర్లబజార్కు చెందిన షేక్ ముస్కాన్కు రూ.2లక్షలు, సూర్య నారాయణనగర్కు చెందిన సాదరబోయిన శరణ్యకు రూ. 2 లక్షలు, ద్వారకానగర్కు చెందిన దొడ్డి దుర్గా మహేష్కు రూ. లక్షా 20వేలు, 19వ వార్డుకు చెందిన మాచర్ల యుగంధర్ కు రూ. 1,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పడవల మహేష్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఖాదర్ వలి (ఫిరోజ్), 19వ వార్డు అధ్యక్షులు చెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, 4వ వార్డు అధ్యక్షులు శివరామకష్ణ, నాయకులు షేక్ సమీర, గోలి నాగ శ్రీనివాసరావు, గంటా దుర్గాప్రసాద్, వంగర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తన నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో శీలం శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అంకితమై ప్రజలకు మేలు చేయడానికి పని చేసే వాళ్ళు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. ఇటీవల అమరావతి రాజధానికి ప్రధాని నరేంద్ర మోడీ వచ్చి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధులు సాధించేందుకు రాష్ట్రంలోని కూటం ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం సానుకూలంగా ప్రజలకు చేసే విధానాలకు మన పార్టీ మద్దతిస్తుందని చెప్పారు.

మంగళగిరి నియోజకవర్గంలో 25 వేల మంది పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ సీతానగరంలో ఉన్నటువంటి ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలను సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సిపిఐ జిల్లా మహాసభలు ఆగస్టు 4,5 తేది లలో గుంటూరులో జరుగుతాయని, అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు 22,23,24 తేదీలలో ఒంగోలులో, జాతీయ మహాసభలు సెప్టెంబర్లో పంజాబ్ లోని చండీగర్లో జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 'ఎన్ఆర్ఐ' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్దగల ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు 16 మంది మంగళవారం క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ లో ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ డి .సంజయ్ తెలియజేశారు. కమ్మిన్స్ సేల్స్ అండ్ సర్వీస్ హెచ్. ఆర్ .సుందర్ మరియు ప్రవీణ మాట్లాడుతూ తమ కంపెనీ మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి వారికి మంచి వేతనంతో వారి అభివృద్ధికి తోడ్పడుతుందని తెలియజేశారు . ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగాధిపతి మహేష్ బాబు మాట్లాడుతూ తమ కళాశాల మొదటి సంవత్సరం నుంచే

ఆన్ క్యాంపస్ డ్రైవ్ల నిర్వహిస్తూ, విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలియజేశారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవికుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీ.తిలక్ బాబు తదితరులు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చేబ్రోలు : జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా పొన్నూరు లో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని పట్టణంలోని ఆచార్య ఎన్జీ రంగా విగ్రహం దగ్గర ఏర్పాటు చేశామని అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ తెలిపారు . రక్తదాన శిబిరంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ మరియు పలువురు రక్తదాతలు రక్తదానం చేశారు.తమ కార్యక్రమాలు కుల మత రాజకీయాలకు అతీతంగానే ఉంటాయని ఉమాశంకర్ తెలిపారు. కార్యక్రమంలో

ఎన్టీఆర్ ఫ్యాన్స్ సభ్యులు గోలమూడిపాడు శివ చిలకపాటి సింహాద్రి సంస్థ ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ వారు రూ.1 లక్ష చెక్కును జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్తేజ చేతులమీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్.గుణ షీలాకు అందజేశారు. కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ వారు సిఎస్ఆర్ నిధులు నుండి గత ఎనిమిది సంవత్సరాలుగా సాయుధ పతాక దినోత్సవ నిధికి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో విరాళాలను అందజేస్తున్నట్లు బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ తరుపున క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, బందావన్ గార్డెన్స్ బ్రాంచ్ మేనేజర్ ఎస్కే.గౌస్ భాషా, కొత్తపేట బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.వాణి, గోరంట్ల బ్రాంచ్ మేనేజర్ పిఎల్.ప్రశాంతి, సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సైనిక సంక్షేమ అధికారికి చెక్కు అందచేస్తున్న కలెక్టర్, బ్యాంకు అధికారులు

ముగ్గురు కానిస్టేబుళ్లు బదిలీ

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రభుత్వ ఉద్యోగస్తులకు బదిలీలు మాము లేనని మంగళగిరి డిఎస్పి స్వేచ్ఛ మురళీకృష్ణ తెలిపారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ముగ్గురిని ఘనంగా సన్మానించారు. ఎక్కడ విధులు నిర్వర్తించిన చట్టానికి లోబడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ రాజు, ఎస్సైలు ప్రతాప్ కుమార్, ఎస్ కే ఖాజావలి, జె శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో తిరంగ ర్యాలీ

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆపరేషన్ సిందూర్కు మంద్దతుగా మంగళవారం చేబ్రోలులో తిరంగ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో తహశీల్దార్ కె శ్రీనివాస శర్మ, టిడిపి నాయకులు మైలా వెంకట రామరాజు ప్రసంగించారు. ఒక మహిళ నాయకత్వంలో అది కూడా మైనార్టీ మహిళ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవడం గొప్ప విషయమని అన్నారు. ఈ పోరాటంలో ఎదురుదాడిలో అనేక మంది సైనికులు వీరమరణం పొందారని, మన రాష్ట్రానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మురళి నాయక్ ప్రాణాలు అర్పించడం జరిగిందని అన్నారు . మురళి నాయక్ మరియు వారి కుటుంబ సభ్యులకు అలాగే వీరణం మరణం పొందిన సైనికులందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ , పొట్టి శ్రీరాములు , సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీరంకి రంగా రావు, అనంతలక్ష్మి నారాయణ , జనసేన మండల అధ్యక్షులు చందు శ్రీరాములు , బిజెపి నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రవీందర్ నాయక్

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి : ద్విచక్ర వాహన చోదకులు, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణం చేసే వారు విధిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని మంగళగిరి పట్టణ ఎస్సై రవీంద్ర నాయక్ సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్లో ఉన్న వాహన చలానాలను వసూలు చేసేందుకు పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్లో మంగళవారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, రోడ్డు భద్రత నిబంధనలను పాటించకుండా రాకపోకలు సాగించిన వారికి చలానాలు వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన, జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది కేవలం నిబంధనలు పాటించకపోవడం కారణంగానే ప్రాణాలను విడిచారని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే వారు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలలో వెళ్లేవారు సీటు బెల్టు విధిగా ధరించాలని సూచించారు. ప్రతి రోజు సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరిమితికి మించిన వేగం తో వెళ్లకూడదని అన్నారు. నిబంధనలను పాటించి సహకరించాలని ఆయన కోరారు.

అనధికారికంగా ఆశీలు వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల నుండి అనధికార ఆశీలు వసూలు చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర జిఎంసి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ సమా వేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులు, జిఎంసి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పి.వి.కే నాయుడు మార్కెట్, కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్, బండ్ల బజార్ (ఫ్రూట్ మార్కెట్) ప్రాంతాలు మినహా నగర పాలక సంస్థ అధికారికంగా ఎక్కడా ఆశీలు వసూళ్ళకు టెండర్లు ఇవ్వలేదన్నారు. కనుక ఆయా ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాలలో ఆశీలు పేరుతో ఎవరైనా నగదు వసూలు చేస్తే, రాతపూర్వక ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణల తొలగింపులో రాజకీయ జోక్యం ఉండబోదని, అధికారులు విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ వెండింగ్ కమిటీ గుర్తించిన ప్రాంతాలలో వీధి వ్యాపారుల కోసం గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్ల ఏర్పాట్ల పై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వెండింగ్ కమిటీలో వీధి వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారని, అందరికి ఆమోదయోగ్యంగా ప్రాంతాలను జోన్లగా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వెండింగ్ జోన్లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ నాగమల్లేశ్వర రావు, సి.ఎం.ఓ.హెచ్ డాక్టర్ అమతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు బి.స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, షేక్ మీరావలి పాల్గొన్నారు.

23వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వారి సమస్య పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారంతో 23వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్ల నుండి తమ సమస్యలు పరిష్కారం కాకపోవటంతో అనివార్యంగా సమ్మెలోకి వెళ్లామన్నారు. ముఖ్యంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం పెంపుదలతో వేతన సవరణ చేయాలని, అలాగే క్రమబద్ధీకరణ, ప్రొవిడెంట్ ఫండ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, ట్రెజరర్ కె.సంధ్య పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో ఎన్ టి ఆర్. విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపిలోనే సామాజిక న్యాయం

మినీ మహానాడులో ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపిలోనే అన్ని తరగతులప్రజలకు ఆదరణ ఉంటుందని, సామాజిక న్యాయం టిడిపితోనే సాధ్యం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నియోజకవర్గం మినీ మహానాడు సభలో ఆమె మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మన్నవ మోహన కష్ణ,డేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర రావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి పలు నియోజకవర్గ మరియు వివిధ అంశాల మీద చేసిన తీర్మానాలను పార్టీ నేతలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసినందుకు భారత సైనికులను అభినందనాలు తెలిపారు. మృతి చెందిన సైనికుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అసంపూర్తిగా మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ప్రాజెక్టుకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ తీర్మానించారు. పార్టీ పటిష్ఠం కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సముచిత స్థానం కల్పించవలసినదిగా తీర్మానం చేశారు. టిడిపి నాయకులు సింహాద్రి కనకాచారి, మన్నవ మోహన కృష్ణ, మద్దిరాల మ్యానీ, తాళ్ళ వెంకటేష్, నిమ్మల శేషయ్య,మల్లె ఈశ్వర రావు,మానుకొండ శివ ప్రసాద్,లాల్ వజీర్, కసుకుర్తి హనుమంతురావు, కార్పొరేటర్లు, నియోజకవర్గ అధ్యక్షులు, రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ మరియు వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు,క్లస్టర్, యూనిట్ , బూత్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

ప్రజాశక్తి-గుంటూరు

స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేసి, చట్టం ఉల్లంఘనలు జరగకుండా చూడాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ మీటింగ్ మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్‌తేజ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు సందర్శించి తనిఖీ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణీ స్త్రీల నుండి గర్భస్థలింగ నిర్ధారణ పరీక్షలపై అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ, ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ తెనాలిలో డిప్యూటీ డిఎంహెచ్ఒ, మిగిలిన చోట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేస్తారని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో మొత్తం 298 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు వున్నాయని, వాటిలో రెన్యువల్ రిజిస్ట్రేషన్ కొరకు ఐదు, మాడిఫికేషన్ కొరకు 25, రద్దు కోసం ఆరు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే క్రొత్తగా 11 స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని వాటిని కమిటీ సభ్యుల, ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిటీ క్రొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్ ,మాడిఫికేషన్, క్యాన్సిలేషన్ ను ఆమోదం తెలపడం జరిగింది.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రాజ్యలక్ష్మీ , డాక్టర్ అనిత, డీఎస్పీ శ్రీనివాసులు, ఎన్‌జిఒ సీడ్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. రోషన్ కుమార్ పాల్గొన్నారు.

మాతృమరణాలపై సమీక్ష..

జిల్లాలో మాతమరణాలు సంభవించకుండా క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళిక ప్రకారం పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ వైద్యశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాత మరణాల సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో గత సంవత్సరం చివరి త్రైమాసికం, ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో జరిగిన ఐదు మాత మరణాలపై సంబంధిత వైద్య అధికారులు , వైద్యనిపుణులు, బాధితుల బంధువులతో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మీ , ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మీ, డీఐఒ శ్రావణబాబు, డిసిహెచ్‌ఎస్ రంగారావు, జీజీహెచ్ గైనకాలజీ హెచ్ఓడీ వి.అరుణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సహకరించాలి

మేయర్ కోవెలమూడి రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి జంతు ప్రేమికులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సి ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి జంతు ప్రేమికులు, అధికారులతో నగరంలో వీధి కుక్కల వలన సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీధి కుక్కల సంతాన నియంత్రణకు జిఎంసి చేపడుతున్న చర్యలకు జంతు ప్రేమికులు సహకరించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కలను పట్టుకో వటం, ఎ.బి.సి చేయడం, ఎ.బి.సి అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి మూడు ప్రధానాంశాలు ఉంటాయన్నారు. వీటిలో ఎ.బి.సి ని నిపుణులైన వైద్యులే చేయాలని మిగిలిని రెండు అంశాల నిర్వహణలో జంతు ప్రేమికుల సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. అటువంటి వారికి కౌన్సిల్ ఆమోదంతో గౌరవ వేతనం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాదవి మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణకు జిఎంసి అధికారులతో జంతు ప్రేమికులు, స్వచ్ఛందసంస్థలు, నగర ప్రజలు కూడా భాగస్వాములు అవటం ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రజలు ఇప్పటికే వీధి కుక్కల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అసెంబ్లీలో కూడా ప్రస్తావించామన్నారు. సమావేశంలో తొలుత వీధి కుక్కల సంతాన నియంత్రణ, వ్యాక్సినేషన్ సమస్యలపై జంతు ప్రేమికుల అభిప్రాయాలను, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వి.ఎ.ఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కెజి శంకర్, సాహితీవేత్తలు

ఎంసి చాగ్లా జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్యానంతరం కేంద్రమంత్రిగా, సుప్రీం కోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా అనేక సంచలనాత్మక తీర్పులు వెలువరించిన గొప్ప న్యాయమూర్తి, రాజనీతిజ్ఞుడు అయిన ఎంసీ చాగ్లా జీవితం వర్తమాన భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ కేజీ శంకర్ పేర్కొన్నారు. జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ తెలుగీకరించిన ఎంసీ చాగ్లా ఆత్మకథ 'శిశిరంలో గులాబీలు' పుస్తకావిష్కరణ సభ స్థానిక లక్ష్మీపురం, ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా జరిగింది. అన్నమ్మ గ్రంధాలయ స్థాపకులు లంకా సూర్యనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ చాగ్లా గొప్ప రాజకీయ దురంధరుడు అని అన్నారు. అనువాదకుడు శివప్రసాద్ చాగ్లా వ్యక్తిత్వాన్ని ఆయన సుదీర్ఘ చరిత్రను ఈ పుస్తకం ద్వారా వివరించారని కొనియాడారు. డాక్టర్ నెల్లూరి సత్యనారాయణ, సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో కె.దయానంద్, ప్రజాసాహితీ దివి కుమార్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి సత్యనారాయణ, మోదుగుల రవికష్ణ, జయచాముండేశ్వరి పబ్లికేషన్స్ కె జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

గుంటూరు చేరుకున్న సిపిఎస్ ఉద్యోగుల చైతన్య యాత్రలో నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరి ంచాల్సిందేనని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాజీ పఠాన్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, సిపిఎస్ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరులో మే 1న ప్రారంభించిన చైతన్య యాత్ర మంగళవారం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా ఎపిజిఈఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ 2004 నుండి అమల్లోకి వచ్చిన సిపిఎస్ పరిధిలోకి రాష్ట్రంలో సుమారు 3.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. బ్రిటీషు పాలనలో జనరల్ డయ్యర్ జలియన్‌వాలా బాగ్‌లో బంధించి కాల్పులు జరిపిన విధంగా, రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగుల్ని సిపిఎస్ వలయంలో ఉంచి జీవచ్ఛవాలుగా మార్చారని విమర్శించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల ఫలితంగా 2017లో గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నా మన్నారు. అవి మినహా 21 ఏళ్ల సిపిఎస్ స్కీమ్ చరిత్రలో ఉద్యోగులకు కష్టాలు, నష్టాలు తప్ప ఎలాంటి ప్రయోజనాలు దక్కలేదన్నారు. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసన తెలపటానికి దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈనెల 23న రాజమండ్రిలో రెండో విడత చైతన్య యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్ 1న సిపిఎస్ ఉద్యోగులకు చీకటిదినంగా పాటిస్తూ గుంటూరు నుండి విజయవాడ వరకూ పెన్షన్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.